క్లుప్తంగా

సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించాలి

నల్లజర్ల: ఇంటి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో సేంద్రియ కూరగాయల పంటల సాగుచేసే విధంగా ప్రకృతి వ్యవసాయ విభాగం పుల్లలపాడులో మహిళలకు అవగాహన కలిగించే కార్యక్రమం చేపట్టి ఉచితంగా 11 రకాల కూరగాయల విత్తనాలను బుధవారం అందజేశారు. నందమూరి రాంబాబు, అల్లూరి హరిశ్చంద్ర విరాళంగా ఇచ్చిన రూ.5 వేలతో తోటకూర, గోంగూర, కొత్తిమీర, చుక్కకూర, పాలకూర, చిక్కుడు, గోరు చిక్కుడు వంటి 12 రకాల విత్తనాలు మినీ కిట్లుగా రూపొందించి 150 మంది మహిళలకు అందజేశారు. ఇటువంటి ప్రకృతి పంటల సాగుతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు తినడం ద్వారా ఆరోగ్యంతో పాటు మహిళలకు ఆహ్లాదం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై వీఏఏలు లలాకుమారి, లీలావతి, యూనిట్ ఇన్‌చార్జ్ కోటేశ్వరీ, ఐసీఆర్పీ నాగలక్ష్మి, వీఏఏ నాగదేవి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

కంటి వైద్య శిబిరం

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో బుధవారం తాళ్లపూడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని యువ పారిశ్రామిక వేత్త అల్లూరి విక్రమాదిత్య ప్రారంభించారు. నేత్ర వైద్యులు 451 మంది విద్యార్థులకు, 36 మంది జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య మాట్లాడుతూ, స్కూల్ ఆవరణలో పిల్లలు చదువుకునే గదులు, పరిసరాలు, విద్యార్థుల భోజనశాల కూడా పరిశుభ్రంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామూర్తి, స్కూల్ చైర్మన్ శివరాంబాబు, హైస్కూల్ హెచ్ఎం రాధికా, పైడిమెట్ట ఎత్తిపోతల సంఘం అధ్యక్షుడు ముళ్లపూడి రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31తో ముగియనున్న అడ్మిషన్లు

నల్లజర్ల: అనుకోని పరిస్థితుల్లో చదువుకు దూరమైన వారికి రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) అండగా నిలుస్తోందని దూబచర్ల ఏ-1 స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. పది, ఇంటర్ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. 14 ఏళ్లు నిండిన వారంతా నేరుగా పదో తరగతిలో చేరవచ్చన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. అడ్మిషన్లకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అక్టోబరు 31 వరకు అవకాశముందన్నారు. సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పూర్తి చేసిన కోర్సులకు సమాన గుర్తింపు ఉంటుందన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పూర్తి చేసిన వారు ఆ ధ్రువపత్రాలతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ఆదివారం, రెండో శనివారం తరగతులు నిర్వహిస్తామన్నారు. ఏడాదిలో 30 తరగతులు ఉండగా.. కనీసం 24 తరగతులకు హాజరైతే చాలు. కోర్సుల్లో చేరి ఐదేళ్ల కాలపరిమితిలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్డీఎస్ఎస్ పనుల నిర్వహణ నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆవపాడు టౌన్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు నిడదవోలు సెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చిక్కాల అగ్రికల్చర్ ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్‌పై వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సరఫరా ఉంటుందని తెలిపారు. అలాగే పల్లంట్ల సబ్‌స్టేషన్‌లో 11 కేవీ లక్ష్మీపురం అగ్రికల్చర్ ఆర్‌డీడీఎస్ పనుల నిమిత్తం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఇదేం దారిద్ర్యం..!

- నరకప్రాయంగా ప్రయాణం
- ఇబ్బందిపడుతున్న 10 గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సాగిపాడు- కొవ్వూరుపాడు మధ్య ప్రమాదకరంగా అల్లి కాలువ రోడ్డు

గోపాలపురం: ఏటా వర్షాలు పడుతున్న సమయంలో సాగిపాడు వద్ద ఉన్న అల్లికాలువపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు, రైతులు, సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అల్లి కాలువపై వంతెన నిర్మాణం చేపడితే సుమారు 10 గ్రామాల ప్రజలకు ఊరట కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షం పడితే చాలు రోడ్డుపై మోకాలి లోతు నీరు ప్రవహించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్న పరిస్థితి.

వర్షం వస్తే ప్రమాదకరంగా పరిస్థితి

మండలంలోని సాగిపాడు- కొవ్వూరుపాడు గ్రామాల మధ్య ఉన్న అల్లి కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల తుపాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు మూడు రోజులు రోడ్డు మీద ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహించడంతో వాహనదారులు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులకు గురయ్యారు. గోపాలపురం నుంచి దొండపూడి మీదుగా తొక్కిరెడ్డిగూడెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, బుచ్చియ్యపాలెం, రాంపాలెం, కొత్తగూడెం, రాజంపాలెం, సాగిపాడు, దొండపూడి గ్రామాలకు ఈ కాలువ ద్వారానే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో గ్రామాల ప్రజలు వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. 10 గ్రామాల ప్రజలకు నిత్యం మండల కేంద్రమైన గోపాలపురంలోని వివిధ పనులపై రావాల్సి ఉంటుంది. వర్షం పడితే ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈ కాలువపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మండల కేంద్రానికి వెళ్లేదెలా?



మండల కేంద్రమైన గోపాలపురానికి నిత్యం ఏదొక పని మీద వెళ్లాల్సి ఉంటుంది. వర్షం పడితే చాలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. అల్లి కాలువపై వంతెన నిర్మించే వరకూ మాకు ఈ కష్టాలు తప్పవు. గ్రామీణ రోడ్లు ఛిద్రంగా తయారయ్యాయి. సంబంధిత పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు.
– దొడ్డిగర్ల రాజ్‌కుమార్, బుచ్చియ్యపాలెం.

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



వ్యవసాయ పనుల సమయంలో అధిక వర్షాలు పడితే పంట పొలాలకు వెళ్లలేకపోతున్నాం. అల్లికాలువ దాటి వెళ్లాలి. పొలంలో ఉన్న పశువులకు దాణా కూడా వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ట్రాక్టర్లు, వివిధ పనిముట్లు అకాల వర్షానికి దెబ్బతింటున్నాయి.
– కె.నరసింహమూర్తి, రైతు, కరగపాడు.

నేడు సర్వసభ్య సమావేశం

గోపాలపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో సుజాత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సమావేశంలో తీర్మానం చేసిన పనులకు సంబంధించి పూర్తైన, ఇంకా పూర్తికాని పనులపై ఆయా శాఖల అధికారులు నివేదికలు అందజేయాలని ఆమె సూచించారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఎంవీఐగా వెంకటరమణ



దేవరపల్లి: పట్టణ రవాణా ప్రాంతీయ యూనిట్ కార్యాలయం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ వెంకటరమణ నియమితులయ్యారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించిన ప్రాంతీయ యూనిట్ కార్యాలయాన్ని దేవరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేశారు. భీమవరం నుంచి వెంకరటరమణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. యూనిట్ పరిధిలో మూడు మండలాలు ఉంటాయని ఆయన చెప్పారు.

బాణసంచా అక్రమ తయారీపై చర్యలు



బాలాజీ సుందరరావు

నిడదవోలు రూరల్: మండల పరిధిలో ఎక్కడైనా అక్రమంగా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సమిశ్రగూడెం ఎస్సై ఎల్. బాలాజీ సుందరరావు హెచ్చరించారు. సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దీపావళి పండుగ నేపథ్యంలో లైసెన్స్ లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసే సమయంలో కచ్చితంగా నిర్దేశించిన భద్రతా ప్రామాణాలు పాటించాలన్నారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంటే 94407 96661 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు

తాళ్లపూడి (కొవ్వూరు): చట్ట విరుద్ధంగా బాణసంచా తయారీ లేదా నిల్వలు చేయరాదని కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం తెలిపారు. పట్టణంలోని బాణసంచా అమ్మకాలు, కేంద్రాల్లో బుధవారం టౌన్ సీఐ విశ్వం, ఎస్సై విజయ్‌కుమార్‌లు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా బాణసంచా తయారీ, నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని, అందువల్ల ఇలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు అధికారుల అనుమతులతో మాత్రమే నడపాలన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. అనుమతులు లేని వారు తయారీ లేదా విక్రయాలు చేపడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అక్రమ బాణసంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 112కు లేదా కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికలను తయారీ కేంద్రాల వద్ద లేదా విక్రయాల వద్ద ఉంచకూడదన్నారు. బాణసంచా తయారీలో అజాగ్రత్త వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలు, యువతులు సురక్షితంగా దీపావళి జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయం ప్రారంభం



దేవరపల్లిలో రవాణా శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

దేవరపల్లి: పట్టణంలో ఏర్పాటు చేసిన రవాణా శాఖ ప్రాంతీయ యూనిట్ కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా దేవరపల్లిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. గతంలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు కొవ్వూరు వెళ్లాల్సి వచ్చేదని, ఇక నుంచి ఆ ఇబ్బంది ఉండదన్నారు. జిల్లా రవాణాధికారి సురేష్ మాట్లాడుతూ, ఇప్పటివరకు కొవ్వూరు ప్రాంతీయ కార్యాలయ పరిధిలో తొమ్మిది మండలాలు ఉండగా, గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాలకు దేవరపల్లిలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించనున్నట్టు ఆయన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో ప్రధాన కార్యాలయం ఉండగా, కొవ్వూరు, దేవరపల్లిలో యూనిట్ కార్యాలయాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ బ్రహ్మారాజు, సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రాంబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

'వానపల్లి'ని సన్మానించిన పూర్వ విద్యార్థులు



దేవరపల్లిలో సత్యనారాయణను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరపల్లి: బుచ్చియపాలెం- దేవరపల్లి రోడ్డులోని పొలంలో బుధవారం గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూలు, కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1971–72 బ్యాచ్ విద్యార్థులు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అబ్రోల్లర్‌లో ఒకే ఏడాదిలో మూడు సార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన జాతీయ క్రీడాకారులు వానపల్లి సత్యనారాయణను వారు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సమ్మేళనంలో పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, పూర్వ విద్యార్థి ఇమ్మణి రాజేశ్వరి మాట్లాడుతూ, 72 ఏళ్ల వయసులో పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై చూడడం ఆనందంగా ఉందన్నారు. శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ, రికార్డ్స్ సాధించడానికి సత్యనారాయణ 30 ఏళ్లు కృషి చేసినట్టు తెలిపారు. ఒకరినొకరు కలుసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రాయల ప్రభాకర్, మల్లిపూడి చిన్నబ్బాయి సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వెళ్లిరావమ్మా.. దుర్గమ్మా..



అశ్వవాహనంపై సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారు



దేవరపల్లిలో రథంపై కనక దుర్గాదేవి ఊరేగింపు

దేవరపల్లి: దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి వాహనాలపై ఉంచి భక్తులు గ్రామాల్లోని పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారి ఆలయం, పల్లపువీధి రామాలయం వద్ద ఉన్న కనక దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహాలను బుధవారం ఊరేగించారు. సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారిని అశ్వవాహనంపై, కనక దుర్గాదేవిని కాళికా దేవి వాహనంపై ఊరేగించి నిమజ్జనం చేశారు.

నిడదవోలు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా వెలగదుర్రు కాపు సంక్షేమ సంఘ యువత ఆధ్వర్యంలో బుధవారం దుర్గాదేవి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులు, వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాలతో సందడి నెలకొంది. సింహవాహనంపై ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని ఊరేగించారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

యువత నైపుణ్యాలు అలవర్చుకోవాలి

నల్లజర్ల: నిరుద్యోగులకు డిగ్రీలు ఉన్నా సరైన ఉద్యోగ అవకాశాలు రాకపోవడానికి కారణం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు లేకపోవడమేనని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్లలో బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మోగా జాబ్ మేళా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 1100 మంది నిరుద్యోగులు హాజరు కాగా.. 20 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుద్యోగుల్లో చదువుకు తగ్గ ఉద్యోగం సంపాదించే నైపుణ్యాలు ఉండటం లేదన్నారు. ఇటువంటి వారికి నైపుణ్యాలు పెంపొందించే విధంగా త్వరలో ఒక పర్మినెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సామాజిక మాధ్యమాలను చూస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. పాలిటెక్నిక్‌లో అపార అవకాశలున్నా ఆ దిశగా ఎవరూ వెళ్లట్లేదన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి మురళీ, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, వివిధ సంస్థల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

నిడదవోలు: నియోజకవర్గంలోని పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోని సుమారు 17 కిలోమీటర్ల పొడవున రెండు రహదారుల మరమ్మతులకు రూ.8.30 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా 8.65 కిలోమీటర్ల పొడవైన కానూరు– గోపవరం రోడ్డు, ఖండవల్లి ప్రధాన రహదారి మరమ్మతులకు రూ.4.15 కోట్లు, 8.25 కిలోమీటర్ల పొడవైన దువ్వ– తేతలి, మునిపల్లి రహదారికి రూ.4.15 కోట్లు విడుదలయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలిచి వాహనదారులకు మార్గం సుగమం చేస్తామని పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు కేవలం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.15.5 కోట్లు ఖర్చు చేసి రోడ్లను వేశామన్నారు. లింకు రోడ్లను సీసీరోడ్లుగా మార్చామన్నారు. ఇప్పటికే చాలా రోడ్లు ప్రారంభించామని, రాబోయే రోజుల్లో మరిన్ని రోడ్లు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆర్థిక సాయం

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన మహిళ నూనె లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రూ.6 వేల ఆర్థిక సాయాన్ని మానవత మండల అధ్యక్షుడు శ్రీనివాస్ చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు రాజశేఖర్, శంకర్, సాయిబాబా, అబ్బులు, రామచంద్రం పాల్గొన్నారు.

సమిశ్రగూడెం వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం పురాతన వంతెనపై బుధవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఒకవైపు ఆర్వోబీ నిర్మాణంలో ఉండటంతో భారీ వాహనాలు దారి మళ్లించడం, మరోవైపు ప్రైవేటు పాఠశాలల బస్సులతో వందలాది వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. గోపవరం, డి.ముప్పవరం వైపు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బాణసంచా అక్రమ నిల్వపై కేసు

నల్లజర్ల: మండలంలోని దూబచర్లలో యలమాటి ఉదయభాస్కరావు ఇంట్లో బాణసంచా అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో బుధవారం మధ్యాహ్నం ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆ ఇంటిపై దాడి చేశారు. నిల్వ ఉంచిన రూ.30 వేల బాణసంచా సామాగ్రిని స్వాధీనం చేసుకొని ఇంటి యజమాని ఉదయ భాస్కరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నిడదవోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్-14,17 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలను బుధవారం ప్రారంభించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి 300 క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని మండల క్రీడా విభాగం కో-ఆర్డినేటర్ బండి ప్రదీప్ తెలిపారు. ఎంఈవో గణేష్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిచంద్ర ప్రసాద్, ఎంఈవో-2 పి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హృదయాలయం నిర్మాణానికి చేయూత

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల (హృదయాలయం) నూతన భవన నిర్మాణానికి రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో అడ్డాల రామచంద్రరావు జ్ఞాపకార్థం తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు అడ్డాల సత్యప్రభాకర్, లీలా హర్షదేవి దంపతులు రూ.32 వేల విలువైన సబ్మెర్సిబుల్ మోటర్ సెట్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.